క్లుప్తంగా

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి సంబంధించి బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాలులో 2024–25 సవరణ బడ్జెట్, 2025–26 అంచనా బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తెలిపారు. ఈ బడ్జెట్‌లపై కౌన్సిల్ కులంకుషంగా చర్చించి ఆమోదించనుందని తెలిపారు. ఈ సమావేశానికి 30 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది విధిగా హాజరై బడ్జెట్ చర్చలో పాల్గొనాలని కమిషనర్ కేవీఆర్ ఆర్ రాజు విజ్ఞప్తి చేశారు.

మార్చి 5న జిల్లాస్థాయి క్రికెట్ లీగ్ పోటీలు


క్రికెట్ లీగ్ పోటీల పోస్టర్లను విడుదల చేస్తున్న శ్రీ చెన్న మల్లేశ్వర యూత్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీ చెన్న మల్లేశ్వర జిల్లాస్థాయి క్రికెట్ లీగ్ పోటీలను మార్చి 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీ చెన్న మల్లేశ్వర యూత్ ప్రతినిధులు తెలిపారు. అయిదు రోజుల పాటు ఐపీఎల్ తరహాలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలను స్థానిక చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో గల చెన్నమల్లేశ్వర గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు యూత్ ప్రతినిధులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, పిండి రాజా, దున్నాల దుర్గ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను యూత్ ప్రతినిధులు మంగళవారం సాయంత్రం విడుదల చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మీనాక్షి ఫౌండేషన్ సభ్యులు

అల్లవరం: దేవగుప్తంలో ఇటీవల చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బుంగ మారతమ్మ కుటుంబానికి మీనాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిత్యావసరాలు అందజేశారు. మీనాక్షి ఫౌండర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి బాధితుల పట్ల ఔదార్యంతో విలువైన వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, నక్కా అరుణకుమారి (పేరూరు), వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చేట్టి వెంకటేశ్వరరావు, నాయకులు కుడుపూడి సూర్యప్రకాష్, చింతా రామకృష్ణ, సాధనాల శ్రీను, పినిమాల విక్రమ్, ఈతకోట సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు రాతపూర్వక హామీ ఇవ్వాలి

అల్లవరం: ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌లో స్థానికులకు ఇస్తామన్న 66 ఉద్యోగాలకు బుధవారం సాయంత్రంలోగా రాత పూర్వక హామీ ఇవ్వాలని లేదంటే ఓఎన్‌జీసీ కార్యకలాపాలను అడ్డుకుంటామని మండల టీడీపీ అధ్యక్షుడు డి.సత్తిబాబురాజు అన్నారు. ఓడలరేవులో మాజీ సర్పంచ్ కొల్లు విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఓఎన్‌జీసీలో ప్రోమోటెక్ సంస్థకు ఇచ్చిన కాంట్రాక్టు ఒప్పందం మేరకు ఈ సంస్థ స్థానికులకు 110 ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. రెండు నెలలుగా పలుమార్లు ఎమ్మెల్యే ఆనందరావు ఆధ్వర్యంలో చర్చలు జరిపిన పిదప 66 ఉద్యోగాలు ఇచ్చేందుకు అంగీకరించిందని సత్తిబాబురాజు తెలిపారు. అయితే విద్యార్హత కారణంగా కేవలం 18 ఉద్యోగాలు మాత్రమే ఇస్తామని కంపెనీ ప్రతినిధులు ప్రకటించారన్నారు. మంగళవారం ఉదయం కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరపగా సానుకూలంగా లేరన్నారు. స్థానికులకు ఇస్తానన్న 66 ఉద్యోగాల నియామకం జరగాలని లేని పక్షంలో స్థానికులతో కలసి కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

8 నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

తాళ్లరేవు: సంతపేట బాలాజీనగర్‌లో కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 8 నుంచి 12 వరకు కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 8న ఉత్సవాలకు విగ్రహ కలశ స్థాపన, ధ్వజారోహణం, అదే రోజు రాత్రి 7 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ఆలయ పున:ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

ముమ్మిడివరం: క్రాపచింతలపూడిలోని ఉమా వల్లభేశ్వరస్వామి ఆలయ పున:ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం నుంచి వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఎలమంచిలి కృష్ణమూర్తి, శివాచార్యుల పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ బాదంపూడి సత్యనారాయణశర్మ, ఉండి సుబ్రహ్మణ్య శర్మ మంత్రోచ్చారణల మధ్య ఆలయ పున:ప్రతిష్ఠా మహోత్సవాలను ప్రారంభించారు.

ఆక్వాకు మంచు గండం!

- పొగమంచు ప్రభావంతో తగ్గుతున్న ఆక్సిజన్ స్థాయి
- చేపలు, రొయ్యలు తెగుళ్ల బారినపడే ప్రమాదం
- ఏరియేటర్లను ఆశ్రయిస్తున్న రైతులు


ముమ్మిడివరంలో ఆక్వా చెరువులు


పట్టుబడి చేసిన రొయ్యలు

ముమ్మిడివరం: ఎడతెరిపి లేకండా కురుస్తున్న మంచు ఆక్వా సాగుకు గండంగా మారింది. ఉదయం 9 గంటలైనా చెరువులపై మంచు దుప్పటి కప్పినట్లు ఉండటంతో నీటిలో ఆక్సిజన్ లెవెల్స్‌తో పాటు, పీహెచ్ లెవెల్స్ సైతం తగ్గుముఖం పడుతుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాల్లో రొయ్య, 30 వేల ఎకరాలలో చేపల సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు వరుస తుపాన్లు, వ్యాధులతో ఇబ్బంది పడ్డ చేపల, రొయ్యల సాగు రైతులు తాజాగా మంచు కారణంగా నీటిలో చల్లదనం పెరగడంతో చెరువులోని రొయ్య, చేపలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

ఒడుదొడుకుల సాగు

ఇటీవల దారుణంగా పడిపోయిన చేపలు, రొయ్యల ధరలు కొద్దికొద్దిగా పెరుగుతూ ఆక్వా రంగం కుదుట పడుతున్న తరుణంలో ఉదయం పూట కురుస్తున్న మంచుతో ఆక్వా సాగు తిరిగి ఒడిదుడుకుల్లో పడింది. చెరువు నీటిలోకి సమయానికి సూర్యరశ్మి చేరక ఆక్సిజన్ లెవెల్స్ పడిపోవడంతో చేపలు, రొయ్యలు, నీటి ఉపరితలంపై తిరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఆక్వా రైతులు నిరంతరం చెరువుల్లో ఏరియేటర్లు తిప్పుతున్నారు. విద్యుత్ సరఫరా లేని చెరువుల వద్ద డీజిల్ ఇంజిన్లతో ఏరియేటర్లు 24 గంటలూ తిప్పాల్సిన దుస్థితి ఏర్పడింది. కొందరు రైతులు చెరువుల్లో ఆక్సిజన్ లెవెల్స్ పెంచడానికి, పీహెచ్ లెవెల్స్ ఉండాల్సిన దానికంటే తక్కువగా ఉంటే ఆ లోటును పూడ్చటానికి రసాయనాలు చల్లుతున్నారు.

15 రోజులుగా ఇదే తంతు

గత 15 రోజులుగా చిరుజల్లుగా పడుతున్న మంచుతో ఉదయం 10 గంటల వరకు ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోవడంతో చేపలు, రొయ్యలు తెగుళ్ల బారిన పడకుండా పంటను కాపాడుకొనేందుకు రైతులు టెక్నీషియన్ల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు 120 నుంచి 100 కౌంటు ఉన్న రొయ్యలను పెద్దకౌంటు వచ్చే వరకు చూడకుండా పట్టు బడులకు ఉపక్రమిస్తున్నారు.

ప్రతికూల వాతావరణంలో తెగుళ్లు

ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ, రాత్రి చలి వంటి ప్రతికూల వాతావరణంతో రొయ్యలకు వైరస్, చేపలకు మొప్పు తెగులు వంటి తెగుళ్లు సోకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గితే నిరంతరం ఏరియేటర్లు తిప్పుకోవాలని, మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. రొయ్య పెద్ద కౌంటుకు చేరుకుంటే యజమానులు ఉదయం పీహెచ్ లెవెల్స్ ఎప్పటికప్పుడు చూసుకోవాలి. ఆక్సిజన్ తక్కువగా ఉంటే పొటాషియం పర్మాంగనేట్ సిద్ధం చేసుకోవాలి.

సాగు ఖర్చు పెరుగుతోంది



ఉదయం కురుస్తున్న మంచు కారణంగా ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోతుంది. నిరంతరం ఏరియేటర్లు వేయడం వల్ల అధిక వ్యయం అవుతోంది. మంచు వల్ల నిరంతరం చెరువు పై శ్రద్ధ తీసుకోవల్సి వస్తుంది. ప్రస్తుతం రొయ్యలు కౌంటు దశకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఎం రామరాజు, ఆక్వా రైతు, అయినాపురం.

ముందస్తు చర్యలు చేపట్టాలి



ఉదయం కురుస్తున్న మంచుతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. ఆక్సిజన్‌తో పాటు పీహెచ్ సమస్య కనిపిస్తోంది. సాధారణంగా పీహెచ్ 7, 5 నుంచి 8.5 వరకు ఉండాలి. కౌంటుకు వచ్చిన చెరువుల్లో డీఓ (డిజాల్వ్ ఆక్సిజన్) తగ్గినట్లు గమనిస్తే ఆక్సిజన్ బిళ్లలను పౌండర్ చెరువులకు అందించాలి.

రామమోహనరావు, విశ్రాంత ఫిషరీస్ ఏడీ.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న మల్లాడి

యానాం: జనవరి 21 నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతులు సాధించిన స్థానిక శారదా ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులను మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యానాం నుంచి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు మూడు ఎగ్జిబిట్స్ పాల్గొనగా శారదా స్కూల్ నుంచి విద్యార్థులు అత్యుత్తమ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో చింతా వెంకన్న, సాలిగ్రామ సుబ్బారావు, అలీషా భూషణం, కంచర్ల చిన్నబ్బాయి, కంచర్ల శ్రీనివాస్ , కాపగంటి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఇంటిపై దాడి అమానుషం

అమలాపురం టౌన్: కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం ఇంటిపై జనసేన కార్యకర్త దాడి చేయడం అమానుషమని అమలాపురంలో పార్టీ ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. పథకం ప్రకారం జరిగిన ఈ దాడిని వారు తీవ్రంగా ఖండించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము తదితరులు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ముద్రగడ ఇంటిపై దాడి చేసిన వ్యక్తి, చేయించిన నాయకులపై ధ్వజమెత్తారు. దాడి చేసింది జనసేన కార్యకర్త అయినప్పటికీ ఆ ఘటనతో తమ పార్టీకి సంబంధం లేదని ఆ పార్టీ నాయకులు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని అన్నారు. పోలీసులు లోతైన దర్యాప్తుతో దాడి చేసిన వ్యక్తినే కాక అతని వెనుక ఉండి ప్రోత్సహించిన వారిపై సైతం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

'వేధింపులకు గురి చేస్తే సహించేది లేదు'


కాట్రేనికోన పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పోలీసుల తీరుపై వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం

కాట్రేనికోన: పోలీసులు అధికార పార్టీకి అండగా నిలుస్తూ ఏక పక్షంగా అక్రమ కేసులు నమోదు చేయడమే కాక వేధింపులకు గురి చేస్తున్నారని దీనిని సహించేది లేదని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం పార్టీ సీనియర్ నాయకుడు పాలెపు లక్ష్మీ ధర్మారావు నివాసంలో మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం జరిగింది. పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడంతో పాటు ప్రతి రోజు స్టేషన్‌కు పిలుపించుకుని వేధింపులకు గురి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వ్యక్తిపై అధికార పార్టీ నాయకులు ఫిర్యాదుతో స్టేషన్‌కు తరలించి కొట్టారని నాయకులు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఫ్లెక్సీ పెట్టినందుకు కేసు పెట్టి వేధించారని, పల్లంకుర్రులో సర్పంచి ఫ్లెక్సీ చించి తొలగించిన వారిపై కేసులు నమోదు చేయలేదన్నారు. రాజకీయ కక్ష్యతో తన భార్యను వీఓఏ ఉద్యోగం నుంచి తొలగించేందుకు ఏపీఓ శ్రీనివాసరాజు ఏక పక్ష నిర్ణయం తీసుకున్నారని సోషల్ మీడియా కన్వీనర్ గిడ్ల శ్రీనివాసరావు ఆరోపించారు. ఏపీఎం శ్రీనివాస రాజు వేధింపులపై పోలీసు స్టేషన్‌లో తన భార్య ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడిచినా చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల వేధింపులు, దళిత మహిళపై ఏపీఎం వేధింపులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కాట్రేనికోన ఎస్సై అవినాష్‌ను నిలదీశారు. పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, నడింపల్లి సూరిబాబు, సంసాని నాగేశ్వరరావు, అక్కల శ్రీధర్, తటవర్తి వెంకటరత్నం, గంటి వెంకట సుధాకర్, పాలెపు ధర్మారావు, కాశి హనుమంతరావు, గెల్లా రాజేంద్ర ప్రసాద్, మల్లాడి బాబ్జి, ఏడిది లక్ష్మణరావు, అయితాభత్తుల శ్రీను, నల్లా రాంబాబు, చొల్లంగి వెంకటేశ్వరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

భాస్కరా.. శుభకరా..


యానాంలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

- ఘనంగా రథసప్తమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


కొమరగిరిపట్నంలో నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లవరం: రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని కొమరగిరిపట్నంలో కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్ల వంశీయులు సూర్య భగవానుని రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. బాజా భజంత్రీలు, మేళ తాళాల నడుమ స్వామివారి రథాన్ని కొమరగిరిపట్నం, బెండమూర్లంక గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, కడలి రామకృష్ణశెట్టి, కొమ్మూరి సత్తిబాబు, మంతెన సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో రథసప్తమి వేడుకలు

యానాం: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక శ్రీవేద పాఠశాలలో విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలను ప్రదర్శించారు. సూర్య నమస్కారాల ఉపయోగాలపై పాఠశాల చైర్మన్ గుత్తుల రామారావు వివరించారు. కార్యక్రమంలో వీరభద్రరావు, నీతూహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం


పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడి శరీరంపై గాయాలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీలోని గంటావారి వీధిలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి 12 మందిని కాటు వేసింది. స్కూలుకు వెళ్లే విద్యార్థులు, స్థానికులపై దాడి చేసి గాయపర్చడంతో ఈ ప్రాంత ప్రజలు భయ భ్రాంతులకు గురయ్యారు. దీంతో స్థానికులు నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించి పిచ్చి కుక్కను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలి

యానాం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి అన్యాయం జరిగిందని కనీసం రెండు లక్షల కోట్లు నిధులు ఈ పథకానికి కేటాయించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం సీహెచ్ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాలి

జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర

ముమ్మిడివరం: ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు పూర్తి స్థాయిలో అందేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావు దొర సూచించారు. ముమ్మిడివరం మండలం కొత్తలంక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారి ముకుంద అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలిత పీహెచ్‌సీలో అమలవుతున్న వివిధ జాతీయ, ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డెవలప్‌మెంట్ గ్రోత్‌పై మరింత దృష్టి పెట్టాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాల పెంపు, శిశువులకు నూరు శాతం టీకాలు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగామ్ ద్వారా మెరుగైన సేవలు అందివ్వాలని సూచించారు. సమావేశంలో సిబ్బంది, పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

అమలాపురం టౌన్: విద్యార్థినులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సాయి స్రవంతి సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన వరల్డ్ క్యాన్సర్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి స్రవంతి అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ ప్రధాన కార్యదర్శి పమ్మి నాగేశ్వరరావుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే కార్యక్రమం జరిగింది. ఆస్పత్రిలోని రోగులకు వాకర్స్ ప్రతినిధులు పండ్లు, బిస్కెట్లు పంచి పెట్టారు. క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బొంతువారిపేటలో అగ్ని ప్రమాదం

రూ.8 లక్షల మేర ఆస్తినష్టం


అగ్ని ప్రమాదంలో ఎగసి పడుతున్న మంటలు

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లి సమీపంలోని బొంతువారిపేటలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. దాకే మంగయయ్మ తాటాకు ఇల్లు, గూటం శ్రీను, కుంచే మరియమ్మలకు చెందిన రేకు షెడ్లు ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. మంగం నరసింహమూర్తి, బండి సత్యనారాయణ డాబా ఇళ్ల తలుపులు, కిటికీలు, టెంట్ సామాన్లు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్నిమాపక అధికారి మరళి కొండబాబు, సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సర్పంచ్ రాయుడు వరలక్ష్మి బాధితులకు తక్షణ సాయంగా కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

వన్నెచింతలపూడిలో పశువైద్య శిబిరం

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి గ్రామంలో పశు వైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ నాగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మారుమూల గ్రామాల్లో సైతం వైద్యం అందించాలనే సంకల్పంతో శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు హెబ్సిబా, తేజ, పశువైద్య సహాయకులు మౌనిక, రమణ, సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై కీలక తీర్పు

యానాం: పుదుచ్చేరి పరిధిలో యానాం, మాహే, కారైకల్ రీజియన్‌లలో ఆరిజన్, మైగ్రేషన్ ద్వారా ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్న నేపథ్యంలో మంగళవారం మద్రాసు హైకోర్టు దీనిపై ఆదేశాలు జారీ చేసింది. తండ్రి మూలాల ద్వారా పుదుచ్చేరికి చెందిన వారైతేనే వారి పిల్లలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారని దీంతో పలువురు నష్టపోతున్నారని బాధితురాలు ఆర్ ప్రియాధరణి వేసిన పిటిషన్‌ను కోర్టు స్వీకరించింది. తల్లికి సైతం పుదుచ్చేరి మూలాలు ఉండి, ఆ ప్రాంతంలోనే శాశ్వత నివాసియై ఉంటే వారి పిల్లలకు సైతం ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలని న్యాయమూర్తులు ఆదేశించారు.

విద్యుత్ శాఖ ఈఈ బదిలీ

నూతన ఈఈగా రాంబాబు

అమలాపురం రూరల్: అమలాపురం విద్యుత్‌శాఖ ఈఈ మోకా రవికుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆచంటలో డిప్యూటీ ఈఈ గా పనిచేస్తున్న కె.రాంబాబు అమలాపురానికి ఈఈగా పదోన్నతిపై రానున్నారు. మూడేళ్లుగా అమలాపురంలో ఈఈగా పనిచేస్తున్న రవికుమార్‌ను రాజమండ్రి టెక్నికల్ డీఈగా బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలి

తాళ్లరేవు: సాగునీరు అందక ఎండిపోతున్న పంట పొలాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని సోమవారం ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో జార్జీపేట, నీలపల్లి తదితర గ్రామాల్లో పంట పొలాల్లో పర్యటించి అనంతరం మాట్లాడారు. ప్రతి ఏడాది దాళ్వాలో నీటి ఎద్దడి వస్తుందని ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ఇరిగేషన్ అధికారులు చేయడం లేదన్నారు.

దివ్యాంగులకు ఆరోగ్య బీమా పథకం

యానాం: బీచ్ రహదారిలో గల ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో మంగళవారం ఆరోగ్య బీమా పథకంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెంటర్ ఇన్‌చార్జి కె శ్రీనివాస్, ఫిజియో థెరిపిస్టు విజయదుర్గాదేవి ఈ పథకం ద్వారా వైకల్యం గల పిల్లలకు ఏడాదికి రూ.లక్ష వరకు బీమా కవరేజీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, మహేశ్వరి, వీరవేణి, తాతారావు, దుర్గ, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.